ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 23 మార్చి , 2026 | పేజీలు : 05

## శాలివాహన చక్రవర్తికి ఘన నివాళి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలో శ్రీ శాలివాహన చక్రవర్తి జయంతి సందర్భంగా వారి విగ్రహానికి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానుభావుల ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,పన్నాల రాఘవరెడ్డి, కౌన్సిలర్ గాజుల సుకన్య, ఘర్షకోటి సైదులు, లింగాల వెంకన్న,సాకుంట్ల నరసింహా,గంగాధర పద్మ తదితరులు పాల్గొన్నారు.

# యువతే 'వికసిత భారత్' నిర్మాణ శిల్పులు

### గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

### భువనగిరిలో అట్టహాసంగా ముగిసిన 'పీఎం సంసద్ క్రీడా మహోత్సవ్'

### 25 వేల మంది క్రీడాకారులను భాగస్వామ్యం చేసిన ఎంపి లక్ష్మణ్‌కు అభినందనలు

### మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తున్న ప్రధాని మోడీ 'ఖేల్ ప్రతియోగిత'



**ప్రజాపక్షం/యాదాద్రి :** 'భారతదేశ భవిష్యత్తు, వికసిత భారత్ నిర్మాణం దృఢమైన యువకుల భుజస్కంధాల పైనే ఆధారపడి ఉంది. యువకులే స్వశక్తితో కూడిన ప్రగతిశీల దేశ నిర్మాతలు' అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో గత మూడు నెలలుగా సాగుతున్న 'పీఎం సంసద్ క్రీడా మహోత్సవ్' ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లను అందజేసి వారిని ఉత్సాహపరిచారు. సభను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న మట్టిలో మాణిక్యం లాంటి క్రీడాకారులను వెలికితీసి, వారిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టితో 'పీఎం సంసద్ ఖేల్ ప్రతియోగిత'ను ప్రారంభించారన్నారు. భువనగిరి పార్లమెంట్ స్థాయిలో రికార్డు స్థాయిలో 25 వేల మంది యువ క్రీడాకారులను ఈ మహోత్సవంలో భాగస్వామ్యం చేసినందుకు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలు కేవలం శారీరక వ్యాయామమే కాదని, యువతలో ధైర్యం, సాహసం, ఓర్పు మరియు సమిష్టి కృషిని అలవరుస్తాయని గవర్నర్ తెలిపారు. భారతీయ సంప్రదాయ క్రీడలైన యోగా, మార్షల్ ఆరట్స్ యువతను మానసికంగా కూడా బలోపేతం చేస్తాయని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21A ద్వారా విద్య ఏ విధంగా ప్రాథమిక హక్కుగా మారిందో, అదే స్ఫూర్తితో క్రీడలను కూడా విద్యార్థులు తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతుడైన క్రీడాకారుడే దేశ ప్రగతిలో కీలక భాగస్వామి అవుతాడని ఆయన ఆకాంక్షించారు.

**యువత గెలిస్తేనే భారత్ గెలుస్తుంది: కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ**

యువత క్రీడల్లో రాణించినప్పుడే దేశ వికాసం సాధ్యమని కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. నేటి యువత మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడా ప్రాంగణాలకు చేరుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని, యువత సాధించే విజయమే భారతదేశ విజయంగా ఆయన అభివర్ణించారు. మహిళా క్రీడాకారులు ప్రపంచ కప్, టీ20 కప్‌లలో సాధించిన అద్భుత విజయాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే, దివ్యాంగులు సైతం ప్రధాని అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై అత్యధిక మెడల్స్ సాధించడం గర్వకారణమని కొనియాడారు. బలమైన యువతతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని, యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో 25 వేల మందికి పైగా యువత ఉత్సాహంగా పాల్గొనడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్, మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్, పీఎం సంసత్ కేల్ మహోత్సవం కోఆర్డినేటర్ జి.మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర నాయకులు కాసం వెంకటేశ్వర్లు, వేముల అశోక్, గూడూరు నారాయణరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా నాయకులు మాయ దశరథ, చందా మహేందర్ గుప్తా, రత్నపురం బలరాం పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

### దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రజాపాలనలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని తాటికోల్ క్లస్టర్ తాటికొల్ రైతు వేదిక లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన రైతు ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చే రైతు భరోసా యాసంగి పంట 2026 వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ఏడిఏ శ్రీలక్ష్మి,మాజీ జడ్పిటిసిఅరుణ సురేష్ గౌడ్,సర్పంచ్ చల్లమల విజయ్,ఏవో రవి కుమార్, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ కుటుంబానికి రూ. 5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

రాష్ట్రంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ప్రభుత్వం అందించడం జరుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో సీఎం సహాయనిధి నుండి మంజూరైన 251 మందికి గాను 92,61000 రూపాయల విలువ గల చెక్కులను స్వయంగా లబ్దిదారులకు అందజేశారు.అనంతరం నియోజకవర్గంలోని కళ్యాణ లక్ష్మీ చెక్కులు కొండమల్లేపల్లి మండలం మొత్తం 11 చెక్కులు గాను 1101276 రూపాయలు,చింతపల్లి మండలం మొత్తం 25చెక్కులకు గాను 2502900 రూపాయలు, చందంపేట మండలం మొత్తం 43 చెక్కులకు గాను 4304988 రూపాయలు, డిండి మండలం మొత్తం 20 చెక్కులకు గాను 2002320 రూపాయలు లబ్దిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు,కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



# కాల్వపల్లి వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

### యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశం



**ప్రజాపక్షం/యాదాద్రి :** మల్లన్న సాగర్ జలాల విడుదలతో రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామ సమీపంలో ఉధృతి పెరిగి, నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక పైపులు కొట్టుకుపోయాయి. ఈ ఘటనతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా సమీక్షించారు. ఇటీవల మల్లన్న సాగర్ నుండి చెరువులకు సాగునీటిని విడుదల చేయడంతో కాల్వలో ప్రవాహం ఒక్కసారిగా పెరిగిందని, ప్రస్తుతం అక్కడ నూతన బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండటంతో రాకపోకల కోసం వేసిన తాత్కాలిక మార్గం నీటి వేగానికి కొట్టుకుపోయిందని ఆయన గుర్తించారు. నీటి ప్రవాహాన్ని, దెబ్బతిన్న రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే.. ప్రజల భద్రత దృష్ట్యా తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేపట్టి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. అలాగే బ్రిడ్జి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి శాశ్వత పరిష్కారం కల్పిస్తామని, అవసరమైతే అదనపు నిధులు కేటాయించి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల ఇబ్బందులు తొలగించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, గ్రామస్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కల్మల్‌చెర్వు వాసి రజిత ఎంపిక



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని కల్మల్ చెర్వు గ్రామానికి చెందిన మామిడి రత్నం ఎల్లమ్మ ద్వితీయ పుత్రిక జనగాం జనరల్ హాసుపత్రిలో స్టాఫ్నర్సుగా పనిచేస్తున్న మామిడి రజిత భర్త కనకయ్య ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ (ఏఐసిఎస్) జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. గత ఏడాది సెప్టెంబర్‌లో హైద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఈనెల 20 నుండి 25వ వరకు న్యూఢిల్లీలో జరగనున్న వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరుపున ఆడనున్నారు. జాతీయ స్థాయి వాలీబాల్ సెలక్షన్ ఐ గ్రామానికి మంచిపేరు తెచ్చినందుకు గ్రామపెద్దలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందిస్తున్నారు.

## జాఫర్ మృతి తీరనిలోటు



**ప్రజాపక్షం/చివ్వెంల:** జాఫర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ధారవత్ వీరన్ననాయక్ అన్నారు. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందిన ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జాఫర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశాడని, ముస్లీంల అభివృద్ధికి పాటుపడుతూ వారికి ఎల్లప్పుడు అండగా ఉండేవాడని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరమార్శించారు. వారి వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యండి అంజద్‌అలీ, పిసిసి ఎస్సీ సెల్ వైస్ చైర్మన్, మాజి జడ్పిటిసి చింతమళ్ల రమేష్, డిసిసి అర్గనైజింగ్ సెక్రటరీ వెన్న మధుకర్‌రెడ్డి, వికె పహడ్ సర్పంచ్ ఈదయ్య పాల్గొన్నారు.

## తవిటి నర్సిరెడ్డికి సన్మానం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా మండల కేంద్రం చెందిన తవిటి నర్సిరెడ్డి ఎన్నిక కావడంతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సమక్షంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమితులై ప్రమాణస్వీకారం చేసిన తవిటి నర్సిరెడ్డిని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దుసాని సిద్ధులు, కార్యదర్శి కందడి అనంతరెడ్డి పాల్గొన్నారు.



## గరికపాటి వ్యాఖ్యలు ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/మునగాల:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి నర్సింహరావు చేసిన అవమానకర, వివక్షాపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన జిల్లా నాయకులు రాయిరాల సుమన్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు భోజనం కోసమే ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారని అనడం వివక్షపూరితమైన మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారని, అలాంటి వారి కోసం మధ్యాహ్న భోజనం పథకం అనేది కేవలం ఆహారం అందించే పథకం కాదని, ఇది పిల్లల ఆకలి సమస్యలను తగ్గిస్తుందన్నారు. గరికపాటి నర్సింహరావు సమాజంలో ప్రభావం కలిగిన వ్యక్తి ఈ విధంగా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. వారు సమాజంలో సమానత్వం, న్యాయం, మానవ విలువలను బలోపేతం చేయాలి గాని అవి దెబ్బతినేలా మాట్లాడకూడదని, అతనిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆయనకు ప్రధానం చేసిన రాష్ట్ర, జాతీయ పురస్కారాలను వెంటనే రద్దు చేయాలని, పేద పిల్లల గౌరవాన్ని దెబ్బతీసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## బిసి సబ్ ప్లాన్ అమలుకు రూ.50 వేల కోట్లు కేటాయించాలి!

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేసి, బీసీల సంక్షేమానికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో 'కామారెడ్డి డిక్లరేషన్' పేరిట బీసీలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించిందని వెంకటయ్య మండిపడ్డారు. ఏటా రూ.25 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా, ఆ ఊసే ఎత్తడం లేదు. బీసీల ఓట్లను కేవలం బ్యాంకులా చూస్తున్నారే తప్ప, సీఎం రేవంత్ రెడ్డికి వారి అభివృ



ద్ధిపై చిత్తశుద్ధి లేదు' అని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, మండల సెక్రెటరీ జనరల్ కసావు శ్రీనివాస్ గౌడ్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సతీష్ యాదవ్, నాయకులు బాలయ్య గౌడ్, కంసాని స్వామి, శారాజీ రాజేష్ యాదవ్, విజయ్, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బడ్జెట్ ప్రజలను వంచించడమే

**ప్రజాపక్షం/భువనగిరి :** అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, బడ్జెట్లో ఆ హామీలకు నిధులు కేటాయించకుండా ప్రజలను నిలువునా వంచిస్తోందని బిఆర్ఎస్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత ధ్వజమెత్తారు. ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు రంగుల ప్రపంచాన్ని చూపించి, అధికారంలోకి వచ్చాక రేవంత్ సర్కార్ చేతులెత్తేసిందని వారు విమర్శించారు. ప్రస్తుత బడ్జెట్ ప్రజారంజకంగా లేదని, ఇది కేవలం '420' ప్రభుత్వమని మండిపడ్డారు. రైతు భరోసా నిధులను ఎగ్గొట్టి రైతులను ఇబ్బందుల్లోకి నెట్టారని, విద్య మరియు వైద్య రంగాల పట్ల ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. బీసీ డిక్లరేషన్‌లో ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్లు కేటాయిస్తా



మని ప్రకటించిన కాంగ్రెస్, ఇప్పటివరకు రూ.20 వేల కోట్లు కూడా భర్తీ చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో 52 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడం లేదని, బీసీ సబ్ ప్లాన్ హామీని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, టిఆర్ఎస్ భువనగిరి అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, భువనగిరి ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ జిల్లా కార్యదర్శి ర్యాకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వానికి ఎందుకు కక్ష

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయడంలో, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి కక్ష ఎందుకని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించకుండ వివక్షత చూపిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ విమర్శించినారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో సిపిఎం ఇంటింటి సమస్యల అధ్యయనంలో భాగంగా గ్రామంలోని గ్రామ సర్పంచ్ రాంపల్లి కృష్ణ, ఉప సర్పంచ్ అందే మల్లేశం, మాజీ సర్పంచ్ మాకొల్ల సత్యంకు కరపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు అశోక్, శాఖ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.



## శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన తిమ్మాపురం మహేందర్ రెడ్డి , ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండాల నరసింహను భువనగిరి వివేర హోటల్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ జెడ్పిటిసి పున్న జగన్మోహన్, మాజీ సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర పాల్గొన్నారు.





## పేదలకు అండగా ప్రభుత్వం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ఆపదలో ఉన్న నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన మొత్తం 326 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య, యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ వాణి భరత్ గౌడ్, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి



**ప్రజాపక్షం/పెన్‌పహడ్:** ప్రథమాంధ్ర పాలకుడు, నవీనశక సృష్టికర్త, కుమ్మరుల మూల పురుషుడు శాలివాహన చక్రవర్తి 1948వ జయంతిని కుమ్మర సంఘం నాయకులు నీలకంఠం జయరామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కుమ్మర సంఘం పెద్దలు నీలకంఠం శ్రీనివాస్, నీలకంఠం వెంకటేశ్వర్లు శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి మొట్ట మొదటి తెలుగు చక్రవర్తిగా ప్రసిద్ధికెక్కారని, వారి జయంతిని జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లుగా తెలిపారు. ప్రభుత్వం కుమ్మరులకు కేటాయించిన 148 జీవోను అమలు చేసి శాలివాహన చక్రవర్తి కుమ్మరి మొల్ల జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలకంఠం సత్యం, నీలకంఠం మహేష్; సురేష్, రేణుక, మంగమ్మ, ఝాన్సీ, వీరేంద్రనాద్, ప్రమోద్ పాల్గొన్నారు.

## కార్బన్ లక్స్ జ్యూవెలరీ ఎగ్జిబిషన్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సొంత తయారీతో వినియోగదారుల అభిరుచి మేరకు అందమైన డిజైన్లతో జూవెల్లరి తయారు చేసి అందుబాటు ధరల్లో అందించడమే కార్బన్ లాక్స్ జ్యూవెల్లరి సిద్ధాంతమని బిజినెస్ కోఆర్డినేటర్ ముస్త్యాల కిషన్, జనరల్ మేనేజర్ మిహెర్‌షా, స్టోర్ మేనేజర్ శ్రీనివాస్ లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం బాలాజీగ్రాండ్ హోటల్లో ఏర్పాటు చేసిన కార్బన్ లాక్స్ జ్యూవెల్లరి రెండు రోజుల జ్యూవెల్లరి ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్‌లో అందమైన డైమాండ్, గోల్డ్, సిల్వర్ జ్యూవెల్లరీతో పాటు దేవుళ్ల విగ్రహాలు, కిరీటాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు కొనసాగే జ్యూవెల్లరి ఎగ్జిబిషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, కార్బన్ లక్స్ జ్యూవెల్లరి సిబ్బంది పాల్గొన్నారు.





## మానవతా దృక్పథం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన ఏలూరి రవి ఇటీవల హైదరాబాదులో ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఇతర వస్తువులను ఆదివారం గ్రామానికి చెందిన నాయకుడు బిఎన్ గౌడ్ అందజేశారు. రవి పిల్లల చదువుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని కూడా అందజేయనున్నట్లు ఆయన సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు యాదయ్య, పుట్టల మహేష్, మేడి సంతోష్, బాలు, భూలచ్చి నరసింహ గౌడ్పాల్గొన్నారు.

## చెక్కు అందజేత



**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజల వరమని మాజీ ఎంపీటీసీ మాందాల రామస్వామి అన్నారు. మండలంలోని సోలిపేట గ్రామాల్లోని రాముని తండా వాస్తవ్యురాలు ధీరావత్ రేణుక ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు రూ.37,500 సీఎం రిలీఫ్ పండు చెక్కును యాదగిరి గుట్ట బీర్ల ఐలయ్య నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## యానాల మల్లారెడ్డి మృతికి వీరేశం నివాళులు



**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ పట్టణానికి చెందిన యానాల మల్లారెడ్డి అనారోగ్యంతో మరణించారు వారి మృతదేహానికి ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ పన్నాల రాఘవరెడ్డి, కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేముల వీరేశంకు సన్మానం

**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రభుత్వ విప్‌గా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నియమితులైన సందర్భంగా ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌సి డిపార్ట్‌మెంట్ చైర్మన్ బోడ స్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో నకిరేకల్ మండల ఎస్‌సి డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు మొలుగూరి సునీల్ కుమార్, కేతేపల్లి మండల అధ్యక్షుడు పోడేటి సింహాద్రి, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఎంఈ ఎఫ్ ఉపాధ్యక్షుడు మాచర్ల సైదులు పాల్గొన్నారు



## నేటి నుంచి రెండూళ్ల రామయ్య బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ మండలం చందుపట్ల, కేతేపల్లి మండలం బండపాలెం గ్రామాల్లో వెలసిన భక్తుల ఆరాధ్యదైవం శ్రీ సీతారామచంద్రస్వామి (రెండూళ్ల రామయ్య') బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 31 వరకు వైభవంగా జరగనున్నాయి. వందల ఏళ్ల సంప్రదాయం ప్రకారం చందుపట్ల ఆలయంలో నిత్యపూజలు జరిగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను నేడు పల్లకిలో బండపాలెం గుట్టపైకి తీసుకెళ్లనున్నారు.దాదాపు 5 కి.మీ. దూరం పల్లకి యాత్రగా నిర్వహించడం ఉత్సవాల ప్రత్యేకతగా నిలుస్తోంది. బండపాలెం గుట్టపై ఉన్న కోనేరు ఎన్నడూ ఎండిపోక పోవడం, నవమి సమయంలో నీటిమట్టం పెరగడం భక్తులను ఆకట్టుకుంటుంది.గంగపుత్రులు స్వామివా



రి పల్లకిని మోస్తూ గుట్టపైకి చేర్చడం ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. 25న ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, గరుడ హోమం,27న శ్రీ సీతారాముల కల్యాణం, 29న రథసేవ,31న ఉత్సవ విగ్రహాలు తిరిగి చందుపట్లకు చేరికతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మొండిచేయి



**ప్రజాపక్షం/నకిరేకల్** : వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం మొండిచేయి చూపిందని రాష్ట్ర మహిళా రైతు సంఘం కన్వీనర్ కందాల ప్రమీల విమర్శించారు. గత ఏడాదితో పోలిస్తే తక్కువ నిధులు కేటాయించడం వల్ల రైతాంగం నష్టపోతుందని ఆమె పేర్కొన్నారు.నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో నిర్వహించిన రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రమీల మాట్లాడుతూ 2026/27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు మాత్రమే కేటాయించడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం మండల కార్యదర్శి ఆకుల భాస్కర్, సహాయ కార్యదర్శి జిల్లా ఉపేందర్,నాయకులు సాబాదు బిక్షం రెడ్డి, సుధీర్,చందు,కలమ్మ,లక్ష్మి పాల్గొన్నారు.

## నూతన విత్తన, విద్యుత్, జీ రామ్ జీ చట్టాలు ఉపసంహరించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** : కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న నూతన విత్తన చట్టం,విద్యుత్ సవరణ బిల్లు, జీ రామ్ జీ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం నకిరేకల్ లో ఆసంఘం జిల్లా కమిటీ నిర్వహించారు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూరైతులు దేశానికి అన్నం పెట్టే వారైనా నష్టాలను భరిస్తూ వ్యవసాయం చేస్తున్నారని, అలాంటి రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకువస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశం ఆసంఘం




జిల్లా అధ్యక్షులు జ్వాలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. డేవిడ్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి,జిల్లా ఉపాధ్యక్షులు బీరెడ్డి సత్తిరెడ్డి, సిలువేరు జానయ్య పాల్గొన్నారు.

## చేనేత-పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నకిరేకల్** : చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని,ఈ నెల 25న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ పిలుపునిచ్చారు.ఆదివారం నకిరేకల్ పద్మశాలి కాలనీలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేత రంగానికి సంబంధించిన పథకాలను రద్దు చేయడం, ముడిసరుకులు, చీరలపై జీఎస్టీ విధించడం వల్ల పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్న భరోసా, త్రిఫ్ట్ పథకం బకాయిలు, నేతన్న భీమా, ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు ఆలస్యం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రావిరాల మల్లయ్య, చిలుకూరి జనార్ధన్, పసునూరి మార్కెండయ్య, జెల్ల లక్ష్మీనారాయణ,రాపోలు నగేష్,పెండెం గణేష్, రాపోలు లింగయ్య పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను ఖండించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** ఖమ్మం పట్టణంలో శాంతియుతంగా మొదలు పెట్టిన బంద్‌ను నిర్వహిస్తుంటే పోలీసులు అక్రంగా అరెస్టు చేసిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులను వెంటనే విడుదల చేయాలని అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని లాల్‌బంగ్లాలో ప్రజా సంఘాల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో గత పది సంవత్సరాలుగా నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ప్రజల ఇండ్లను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ అందరికి అదే స్థలంలో తిరిగి ఇల్లు కట్టించి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో ఖమ్మం



పట్టణ బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందని, ఈ బంద్‌ను శాంతియుతంగా మొదలు పెట్టిన పార్టీ నాయకులను అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి వి.నర్సింహరావు, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి డి.రవి, రైతుకూలి సంఘం నాయకులు అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, పులి రాఖీ, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.



## సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతుల సంసదర్భగా కులరహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదపం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. ఆదివారం పట్టణంలోని కందుకూరు కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను కొనసాగించడానికి భావితరాలకు సామాజిక వివక్ష, అన్యాయాలు, దళితుల సంక్షేమం, అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. పూలే అంబేద్కర్ జనజాతర ద్వారా కుల రహిత సమానత్వం కోసం సామాజిక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కొండేటి శ్రీను, రెమిడాల పరుశురాములు, దైద శ్రీను, కోడిరెక్క మల్లయ్య, దోరేపల్లి మల్లయ్య, ఏసు, నల్ల రామస్వామి, బొంగరాల వెంకటయ్య, రెమడాల పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

## గరికపాటి తీరు ఆక్షేపనీయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు పట్ల ప్రముఖ ప్రచారకర్త, అవధాని గరికపాటి నరసింహారావు తీరు ఆక్షేపనీయమని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరధ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసమే పిల్లలు బడికి వస్తారా, చదువు పట్ల వారికి శ్రద్ధ లేదని పేర్కొనడం గరికపాటికి మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ బడుల్లో అమలు పరిచే మధ్యాహ్న భోజనం గుడ్లపై ఉన్న శ్రద్ధ చదువుపై లేదని అనడం భావ్యం కాదన్నారు. లేనిపక్షంలో అగ్రవర్ణ తీరును తీవ్రంగా పరిగణించి ఆందోళనకు పిలుపునిస్తామన్నారు.

## నాతాళ్ల గూడెం వాసికి డాక్టరేట్



**ప్రజాపక్షం/వలిగొండ** : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతాళ్ల గూడెం గ్రామానికి చెందిన జూకంటి వెంకటయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో చేసిన పరిశోధన గ్రంథానికి గాను పీహెచ్డీ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. విశ్వవిద్యాలయ సహ ఆచార్యులు డాక్టర్ ఎం.రమణ పర్యవేక్షణలో 'ఏ రోల్ ఆఫ్ రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఇన్ గవర్నెన్స్, రూరల్ డెవలప్మెంట్ : ఏ కేస్ స్టడీ ఆఫ్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్' అనే అంశంపై పరిశోధనకు గాను పీహెచ్డీ డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసింది. నాతాళ్ల గూడెం గ్రామానికి చెందిన రాములు, ఐలమ్మల చిన్న కుమారుడు వెంకటయ్య ప్రస్తుతం సికింద్రాబాద్ లోని సీతాఫల్ మండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. నాతాళ్లగూడెం గ్రామం నుంచి పీహెచ్డీ పట్టాను పొందిన తొలి వ్యక్తి ఇతనే కావడం విశేషం. వెంకటయ్య తన విద్యాభ్యాసాన్ని పదవ తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వలిగొండ, ఇంటర్మీడియట్ ప్రగతి జూనియర్ కళాశాల వలిగొండ, బీఏ శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల భువనగిరి, పీజీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొనసాగించారు. వెంకటయ్య పీహెచ్డీ డాక్టరేట్ పట్టాను పొందడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సహచర అధ్యాపకులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్‌పురం గ్రామానికి చెందిన పత్తేపు యాదగిరి గుండె, కిడ్నీ సమస్యలతో చాలా రోజుల నుండి బాధపడుతూ అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబానికి ఏజేఆర్ ఫౌండేషన్ ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో రూ.5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## హెల్పింగ్ హాండ్స్ ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ జంగాలకాలనీకి చెందిన విలేకరి ప్రవీణ్ కుమార్ కూతురు దువ్వ భావన 5 సంవత్సరాల చిన్నారికి గత 15 రోజుల క్రితం ఆపేండెక్స్ ఆపరేషన్ చేయడం జరిగింది.కడుపులో మొత్తం ఇన్ఫెక్షన్ అవ్వడంతో పేగు బైటికి పెట్టారు.చిన్నారికి ఖర్చుతో కూడుకున్న వైద్యం కావడంతో పాప తండ్రి ప్రవీణ్ కుమార్ కు ఆదివారం హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయంగా 10వేలు అందజేశారు.

## రైతు ఉత్సవాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షణ



**ప్రజాపక్షం/చండూరుః** ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు కార్యక్రమం లో భాగంగా ఆదివారం సిద్దిపేట జిల్లా నెర్మట్టలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించపడిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ , రైతు భరోసా నిధులు విడుదల కార్యక్రమాన్ని నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన రైతులు రైతు వేదికలో వీడియో కాన్పరెన్స్ ద్వార వీక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్ , ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య, ఏఈఓ పవన్ , రైతులు బిఎస్ రెడ్డి, మందడి శంకర్ రెడ్డి, జానీ, దశరథ పాల్గొన్నారు.

## రైతు మహోత్సవానికి మర్రిగూడ రైతుల




**ప్రజాపక్షం/మర్రిగూడ:** నర్మెటలో నిర్వహించనున్న ఆయిల్ రిఫైనరీ ప్రారంభోత్సవం, రైతు మహోత్సవానికి మర్రిగూడ మండలం నుంచి ఆయిల్ పామ్ రైతులు పెద్దఎత్తున తరలివెళ్లారు..జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నర్సరీ ఇంచార్జి యాదయ్య నేతృత్వంలో యాదయ్య,అనంతం,శ్రీను బయలుదేరి వెళ్లారు.

## ఘనంగా జల దినోత్సవం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా ఆదివారం వట్టిపల్లి గ్రామంలో జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిక్షమయ్యతో పాటు అధికారులు శాంత కుమారి, వెంకటయ్య,లింగస్వామి పాల్గొని గ్రామస్తులకు నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై వివరించారు.



## 23 ఏళ్ల తర్వాత అక్షరాల సాక్షిగా.. ఆత్మీయ సమ్మేళనం!

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కాలం వెనక్కి మళ్లింది.. జ్ఞాపకం పలకరించింది.. మరుగున పడిన బాల్యం మళ్లీ చిగురించింది. కట్టంగూరు మండలం చెర్వు అన్నారం ప్రభుత్వ పాఠశాల వేదికగా ఆదివారం అపూర్వ దృశ్యం ఆవిృతమైంది. సరిగ్గా 23 ఏళ్ల విరామం తర్వాత, 2002/03 పదవ తరగతి విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హోదాలు పక్కన పెట్టి, వయసును మరిచి.. ఒకప్పటి తమ అక్షరాల సాక్షిగా ఆ పాత నేస్తాలందరూ ఒక్కటయ్యారు.సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా హత్తుకుని ముచ్చటించుకున్నారు. తమను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన గురువులను ఈ సందర్భంగా వారు మర్చిపోలేదు. నాటి ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి, పాదాభివందనం చేసి, ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. సహపంక్తి భోజనాలు, సెల్ఫీలు, పాత పాటల సందడితో రోజంతా ఉత్సాహంగా గడిపిన మిత్రులు.. మళ్లీ కలుద్దామన్న ఆశతో, తీపి జ్ఞాపకాలతో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు మిట్ట శ్రీనివాస్ రెడ్డి, చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు మంజులతారెడ్డి,అబ్దుల్ ముఖీద్, శ్రీరంజని, శ్రీనివాస్, విద్యాసాగర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ నంద్యాల అనంతరెడ్డి , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## చందంపల్లి పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మండలంలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 2003/04 విద్యా సంవత్సరంలో ఏడవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులను సన్మానించారు.గ్రామ సర్పంచ్ మాచర్ల చంద్రకళ యాదగిరి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు కనుకుంట్ల నవీన్ రెడ్డి,మాజీ ప్రధానోపాధ్యాయులు మోదుగు అంజిరెడ్డి,ఉపాధ్యాయులు యాట మధుసూదన్ రెడ్డి,కుంభం ప్రభాకర్,కందుకూరు రాములు,గాదరి లక్ష్మి,దుస్స శ్రీనివాస్, వేదాంతం ఆదిత్యలకు ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్,ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తందు జానయ్య, శంకర్,ఆకారపు జానీ, వంగూరి సుధాకర్,వంగూరి సైదులు తదితరులతో పాటు సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, ముఖ్య అర్చకులు కాండూరి శ్రీనివాసాచార్యులు శాస్త్ర విరుద్ధంగా వ్యవహరించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన వివిధ హిందూ సంఘాల నేతలతో కలిసి ఆలయ ఈవో జె.భవానీ శంకర్ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నల్ల రాధాకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాన అర్చకుడు వెంకటాచార్యుల పాలి బంధువు కాండూరి భార్గవ్‌కు శిశువు జన్మించడంతో ఆ కుటుంబానికి 'జాతాశౌచం' (మైల) వర్తిస్తుందని తెలిపారు. హిందూ ధర్మశాస్త్రం ప్రకారం పది రోజుల పాటు ఆలయ ప్రవేశం, పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ విషయాన్ని దాచిపెట్టి ప్రధాన అర్చకులు బ్రహ్మోత్సవాల్లో చురుగ్గా పాల్గొనడం తీవ్రమైన తప్పిదమని ఆరోపించారు. ఫిబ్రవరి 25న జరిగిన స్వామివారి కళ్యాణంలో మైలలో ఉండి కూడా వెంకటాచార్యులు స్వయంగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పట్టువస్త్రాలను మైలతోనే స్వీకరించడం ధర్మానికి విఘాతం కలిగించడమే. మంత్రులు, ఉన్నతాధికారులకు అదే స్థితిలో ఆశీర్వచనాలు అందజేశారు. రథంపై ఎక్కి పూజలు నిర్వహించడమే కాకుండా, పూర్ణాహుతి, చక్రస్నానం వంటి కీలక ఘట్టాల్లోనూ పాల్గొన్నారు. ఇది కేవలం పొరపాటు కాదు, హిందూ ధర్మాన్ని, శాస్త్రాన్ని అవమానపరచడమే. టీవీలు, పత్రికల్లో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నల్ల రాధాకృష్ణ, బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షులు ఈ వ్యవహారంపై ఐఏఎస్ అధికారి లేదా రిటైర్డ్ న్యాయమూర్తితో ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపించాలని, బాధ్యులైన అర్చకులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఈవో, పూర్తిస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్ద యుగంధర్, సీనియర్ సిటిజన్స్ జేఏసీ కన్వీనర్ హనుమాండ్ల విష్ణు, విహెచ్పి నేత కొమ్మగళ్ళ వెంకటేశ్వర్లు, ఆలయ పరిరక్షణ సమితి కన్వీనర్ కనుకుంట్ల విజయకుమార్, బీజేపీ నేత బొల్లం చంద్రమౌళి పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని కమ్మగూడ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు దామెర శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతితో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామపంచాయతీ తరఫున సహాయం అందించారు. సర్పంచ్ రమావత్ విజయ లక్ష్మణ్ దామెర శ్రీను భార్య అంజమ్మకు ఆర్థిక సహాయంగా రూ.10,000లను అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బడ్జెట్లో బిసిలకు అన్యాయం

**ప్రజాపక్షం/హాలియా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీలకు నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారని బీసీ సంఘం నాయకులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం హాలియాలో బిసి సంఘం నేతలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం బడ్జెట్లో బీసీల అభివృద్ధికి ఏటా 20వేల కోట్ల రూపాయలను కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ నాటి హామీని విస్మరించిన కాంగ్రెస్ పార్టీ నిధుల కేటాయింపులు బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ బడ్జెట్లో కనీసం బీసీల అభ్యున్నతికి 20వేల కోట్ల రూపాయల కూడా కేటాయించకపోవడం బాధాకరమని ఇది బీసీల వ్యతిరేక ప్రభుత్వమని చెప్పకనే చెప్పారని తెలిపారు. ఈ సమావేశంలో పిడిగం నాగయ్య,రామలింగయ్య, నల్గొండ సుధాకర్,సురభి రాంబాబు,మధుబాబు,సత్యపాల్, చేగొండి కృష్ణ, బొల్లం సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**ప్రజాపక్షం/మర్రిగూడ:** శివన్నగూడెం జెడ్‌పి స్కూల్ 2001/02 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.దాదాపు 25 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ బాల్యస్మృతులను గుర్తుచేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు.చిన్ననాటి స్నేహాలు, పాఠశాల రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, గురువులతో గడిపిన మధుర క్షణాలను నెమరువేసుకుంటూ పరస్పరం హృదయపూర్వకంగా పలకరించుకున్నారు. ఈ ఆత్మీయ కలయికతో పాత స్నేహాలు మరింత బలపడగా, అందరి హృదయాల్లో చిరస్మరణీయమైన అనుభూతిగా ఈ కార్యక్రమం నిలిచిపోయింది.

## ఇందిరమ్మ బీమా పథకం పేదలకు వరం

**ప్రజాపక్షం/చండూరుః** ఇందిరమ్మ బీమా పథకం పేద ప్రజలకు వరమని కాంగ్రేస్ పార్టీ చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన చండూరులో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం శాసన సభ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం , ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క 2026/ 27 ఆర్థిక బడ్జెట్‌లో రాష్ట్రంలోని ప్రజలందరికి ఇంటింటికి ఇందిరమ్మ 5లక్షల రూపాయల ఇందిరమ్మ బీమా పథకం సౌకర్యాన్ని కల్పించడం పట్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం అవుతుందని చంద్రశేఖర్ అన్నారు.

## నేడు పొట్లపాడులో దమయంతి స్వయంవరం నాటక ప్రదర్శన



**ప్రజాపక్షం/పెన్‌పహడ్:** మండల పరిధిలోని పొట్లపాడు గ్రామంలో శ్రీ సీతరామంజనేయ స్వామి నాట్య కళమండలి కళాకారులచే నేడు సోమవారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రీ తడకమళ్ల రామచంద్రరావు రచించిన ''దమయంతి స్వయంవరం నాటకం'' ప్రదర్శించబడుతుందని నిర్వాహకులు బాసంపల్లి యాదగిరి, చల్లా సత్యనారాయణరెడ్డి లు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. 30 మంది కళాకారులు కష్టించి నేర్చుకుని ఈ దమయంతి స్వయంవరం అనే నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నాటకాన్ని వీక్షించి జయప్రదం చేయాలని కోరారు. ఈ పద్య నాటక కళాకారులు జర్నలిస్టు దనియాకుల వెంకటేశ్వర్లు, నారాయణ, సత్యనారాయణరెడ్డి, పద్మావతి, రఘునాదమ్మ, గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, నర్సింహచారి, దాచేపల్లి లక్ష్మి , కందిమళ్ల నాగలక్ష్మి , రాగి భాస్కరచారి, గుండు వెంకటేశ్వర్లు, ఏలే నారాయణలున్నారు.

# జనగణనలో కుల గణన చేపట్టాలి

### బిసి నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి..



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఏప్రిల్ నెల నుంచి ప్రారంభమయ్యే దేశ జనగణనలో కుల గణన చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యాలయంలో జరిగిన ఆ సంఘ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏనాడో 1931లో జరిగిన కుల గణన తర్వాత ఈనాటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా కులగణన చేపట్టలేదని, మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో కుల గణన చేపట్టాలని బిజెపి పార్టీ పార్లమెంటులో నానా యాగి చేసిందని తీరా బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏకాభిప్రాయ సాధన పేరుతో గత 11 సంవత్సరాలుగా కుల గణన చేపట్టకుండా మోకాలడ్డుతోందని, దేశంలోని పలు బీసీ సంఘాలు దశాబ్దాల కాలంగా జన గణనలో కుల గణన చేపట్టాలని ఉద్యమాలు చేసిన ఫలితంగా దిగివచ్చిన ప్రభుత్వం నేడు జన గణనకు ముందుకు వచ్చిందని అందులో కుల గణన చేసి దేశవ్యాప్తంగా ఏ కులం జనాభా ఎంత ఉందో లెక్క తీసి అదే నిష్పత్తిలో ఆయా కులాల వారికి ఆర్థిక, రాజకీయ వాటా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపితే 11 నెలలుగా అట్టి బిల్లును ఆమోదించకుండా కేంద్రంలోని ఎన్డిఏ ప్రభుత్వం ఎందుకు తొక్కి పట్టిందని, కేవలం 42 శాతం మాత్రమే కాదు దేశ జనగణనలో కులగణన చేపట్టి అన్ని కులాల వారికి సమాన వాటా కల్పించాలని, దేశ స్వాతంత్ర ఫలాలు అట్టడుగు వర్గాల వారికి కూడా అందాలని స్వాతంత్ర వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికి అనేక కులాల వారు పార్లమెంటు గడప తొక్క లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి కళ్లెం కృష్ణ అధ్యక్షత వహించగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల అశోక్ స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, గోదా శ్రీరాములు, సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చిలివేరు అంజయ్య, అన్నెమైన వెంకటేష్, గొట్టిపాముల శ్రీనివాస్, సముద్రం శ్రీనివాస్, కొల్లూరి రాజయ్య, పుట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా మోహన్ బాబు నాయక్ నియామకం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వివేరా కన్వెన్షన్ హాల్లో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా సెక్రటరీగా నియమితులైన రుస్తాపూర్ తాజా మాజీ ఎంపీటీసీ ధనావత్ మోహన్ బాబు నాయక్‌కు నియామక పత్రాన్ని అందుకోవడం జరిగిందని మోహన్ బాబు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, బీర్ల ఐలయ్యకు, పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## డిసిసి ఉపాధ్యక్షులుగా జోజి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** నామీద నమ్మకం ఉంచి పార్టీలో యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బీర్ల ఐలయ్య, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే యువతరానికి నాంది భవిష్యత్తులో కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అలాగే భువనగిరి పార్లమెంట్ సభ్యులు కిరణ్ కుమార్ రెడ్డి, తనకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఎమ్మెల్యే ఎంపీకి ఆహ్వానం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం శివారెడ్డి గూడెంలోని శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం ద్వితీయ కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఆదివారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలకు ఆహ్వానాలు అందజేశారు. ఈ నెల 24, 25, 26, 27 తేదీలలో జరిగే బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా మనవి చేశారు. గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, ఉప సర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్, మాజీ సర్పంచ్ ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ వారాల రామచంద్రా రెడ్డి, వారాల రేవంత్ రెడ్డి, చిలుకల శివకుమార్, విష్ణు రెడ్డి, సరసాని వెంకట్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

## యాదగిరిగుట్ట ఇండ్ల కూల్చివేతకు కుట్ర జరుగుతోందా?



**ప్రజాపక్షం/భువనగిరి :** ఆలేరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలోని ఇండ్లు 'ప్రొహిబిషన్' జాబితాలో చేర్చడం వెనుక ప్రభుత్వ మర్మమేమిటని బిఆర్ఎస్ నేత కల్లూరి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలోని వెలుగుమెట్లలో పేదల ఇళ్లను ఏ విధంగా కూల్చివేశారో, అదే తరహాలో యాదగిరిగుట్టలో కూడా పేదల ఇళ్లను నేలమట్టం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు పేదల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కేవలం మాటలతో సరిపెట్టకుండా ప్రొహిబిషన్‌లో ఉన్న ఇళ్లను కూల్చబోమని జిల్లా కలెక్టర్ చేత అధికారిక ప్రకటన చేయించి, ప్రొహిబిషన్‌లో నుంచి తీసివేయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎమ్మెల్యే హామీలు ఇస్తున్నారే తప్ప, అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గానీ, ఇటు సంబంధిత మంత్రులు గానీ, అధికారులు గానీ ఎలాంటి రాతపూర్వక హామీ ఇవ్వలేదని, ప్రజలను మభ్యపెట్టడానికే ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అప్పులు చేసినా, అవి కళ్లకు కనిపించే అభివృద్ధికి నిదర్శనంగా నిలిచాయని రామచంద్రారెడ్డి గుర్తు చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, నూతన సెక్రటేరియట్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, అత్యాధునిక రోడ్లు, కొత్త జిల్లాలకు కలెక్టరేట్ భవనాలు నిర్మించి రాష్ట్ర రూపురేఖలు మార్చారని కొనియాడారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నర ఏళ్లలో వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్రంలో ఏ రకమైన అభివృద్ధి సాధించిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వంలో అమలైన అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ వంటి అద్భుతమైన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భువనగిరి మాజీ జెడ్పిటిసి సుబ్బారు బీరు మల్లయ్య తదితరులు ఉన్నారు.

## అక్రమ గ్యాస్ వినియోగ దారులపై కొరడా విసిరిన సివిల్ సప్లై అధికారులు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** యుద్ధం నేపథ్యంలో గృహ వినియోగదారులకు గ్యాస్ కష్టాలను అధిగమించేందుకు సివిల్ సప్లై అధికారులు భూదాన్ పోచంపల్లి పట్టణంలో అక్రమ వినియోగదారులపై కొరడా ఝుళిపించారు. సివిల్ సప్లై అధికారిణి బాలమణి ఆదివారం మెరుపు దాడికి దిగారు. పట్టణ కేంద్రంలోని హోటల్లు టిఫిన్ సెంటర్లు బిర్యాని పాయింట్లు నడుపుతున్న కేంద్రాలపై విరుచుకుపడ్డారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌ను వాడుతున్న వ్యక్తుల నుండి గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపార సిలిండర్లను కాకుండా డొమెస్టిక్ సిలిండర్‌ను వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తనిఖీలో తీవ్రంగా హెచ్చరించారు. ప్రపంచ యుద్ధం జరుగుతున్న దృష్ట్యా గృహ వినియోగదారులకు గ్యాస్ కష్టాలను తీర్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

## మండల మహిళా అధ్యక్షురాలిగా యంజాల కల

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం మండల మహిళా అధ్యక్షురాలుగా రామలింగపల్లి మాజీ సర్పంచ్ యంజాల కలను రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మహిళలు రాజకీయాల్లో ముందడుగులో ఉండాలని దానికోసం ప్రతిక్షణం కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## పుస్తకావిష్కరణ కార్యక్రమం

**ప్రజాపక్షం/రామన్నపేట :** శ్రీపరాభవ ఉగాది సందర్భంగా వెల్లంకిలోని ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయంలో కవి సమ్మేళనంతో పాటు 'కూరెళ్ళ విఠలాచార్య సాహిత్యంసమాలోచనం' అను పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండ కృష్ణ కౌండిన్య సంపాదకత్వంలో వెలువడిన 'కూరెళ్ళ సాహిత్యం సమాలోచనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆచార్య కూరెళ్ల సాహిత్యం పై డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు సంబంధించిన వ్యాసాలను ఒక పుస్తకంగా తీసుకురావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. డాక్టర్ కూరెళ్ళ సమగ్ర సాహిత్యానికి ఈ పుస్తకం నిలువుటద్దంపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య పల్లెల్లో ఉంటూ తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి వ్యక్తియని, ఎంతో మందికి ఆదర్శప్రాయులని అన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న 40 మంది కవులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య, పుస్తక సంపాదకులు డాక్టర్ తండ కృష్ణ కౌండిన్య, మహిళాభారతి అధ్యక్షులు డాక్టర్ దాసోజు పద్మావతి, కార్యక్రమ సమన్వయకర్త, యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, కూరెళ్ల గ్రంథాలయం అధ్యక్ష కార్యదర్శులు భోగోజు గోవర్ధనాచారి, కూరెళ్ళ నర్మద తోపాటు పలువురు సాహితీవేత్తలు కవులు పాల్గొన్నారు.

